కొత్త లీడర్లకు కసరత్తు

మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందడానికి ప్రభుత్వం తోడ్పాటునిస్తోంది. అందులో భాగంగా మహిళా సంఘాలను ఏర్పాటు చేసి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి వారి అభ్యున్నతికి పాటు పడుతోంది. ప్రస్తుతం మండలాల్లో మహిళా సంఘాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొనే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

- మహిళా సంఘాల్లో ఎన్నికల సందడి
- కొత్తవారిని ఎంపిక చేసేందుకు అధికారుల సన్నద్ధం


దౌల్తాబాద్ ఐకేపీ కార్యాలయంలో కమిటీ సభ్యులు (ఫైల్)

దౌల్తాబాద్: స్వయం సహాయక సంఘాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొనేందుకు అధికారుల కసరత్తు మొదలైంది. సంఘం సభ్యుల నుంచి గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లతో పాటు సభ్యులను ఎన్నుకునే ప్రక్రియను ఐకేపీ అధికారులు చేపట్టనున్నారు. ఇందుకోసం ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఏపీఎం, సీసీలకు ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వీరు గ్రామ స్థాయిలో కొత్త కార్యవర్గం ఎంపికకు గ్రామ సమైఖ్య సంఘాలు, సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎంపిక కార్యక్రమాన్ని ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

8,610 మంది సభ్యులు

మండలంలో 40 గ్రామసంఘాలు 830 చిన్న సంఘాలు ఉన్నాయి. ఇందులో 8610 సభ్యులు ఉన్నారు. ఈ సంఘాలు ఆర్థిక అభ్యున్నతి వైపు పయనిస్తున్నారు. ఓ వైపు కుటుంబ బాధ్యతలు మరోవైపు చిరువ్యాపారాలు చేస్తూ ఎదుగుతున్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటూ బ్యాంకులు, స్త్రీనిధి రుణాలు పొందుతున్నారు. కుటీర పరిశ్రమలు ప్రారంభించి ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. ఇందులో అధ్యక్ష, ఉపాధ్యక్షుల పాత్ర కీలకం. అయితే మండలంలో ఉన్న మహిళ సంఘాల్లో రూ.కోట్లల్లో లావాదేవీలు కొనసాగుతున్నాయి.

మిగతా వారికి అవకాశం

స్వయం సహాయక సంఘంలో కనీసం పది నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. మండల వ్యాప్తంగా ఉన్న సంఘాల్లోని సభ్యులకు కొత్త వారికి నూతన కార్యవర్గంలో అవకాశం కల్పిస్తారు. నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవం, చేతులు పైకి ఎత్తి ఎన్నుకోవడం, కాగితాలు రాసి సభ్యురాలి ఎన్నికకు మద్దతు తెలియజేయనున్నారు. సంఘాల ద్వారా ఎన్నికైన అధ్యక్షులు గ్రామ సంఘం అధ్యక్షురాలిని, గ్రామస్థాయి అధ్యక్షులు అందరూ మండల అధ్యక్షురాలిని, తర్వాత జిల్లా అధ్యక్షురాలిని ఎన్నుకుంటారు. మండల స్థాయి ఎన్నికను వచ్చే నెలాఖరు వరకు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఏపీఎం సాయన్న తెలిపారు.

ఆర్థికంగా ఎదుగుతున్నాం



స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేరి అధ్యక్షురాలు అయ్యాను. అయితే మహిళా సంఘాలతో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలు తదితర పథకాలతో ఆర్థికంగా ఎదుగుతున్నాం. రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి కొత్త వారికి అవకాశం ఇవ్వడం మంచిది.

– శ్రీదేవి, దౌల్తాబాద్

గైడ్‌లైన్స్ వచ్చాయి

గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకుగాను ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే తమకు జిల్లా కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఇక గ్రామాల్లో పర్యటించి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం.

– సాయన్న, ఏపీఎం

క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయండి


ఎంఐఎం కొడంగల్ అధ్యక్షుడు గుల్షన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

కొడంగల్ రూరల్: ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్‌ను సోమవారం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మెల్సీ కొడంగల్ మీదుగా హల్ కట్టా షరీఫ్, గుల్బర్గాకు వెళ్తున్న క్రమంలో ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్‌ను సత్కరించారు. ఎంఐఎం పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాంపల్లి కార్పొరేటర్ జఫర్, నాయకులు షేక్ రోమన్, ఎండీ.సర్తజ్ హుస్సేన్, షేక్ అబిద్, దానిష్, ఖలీద్, నాసర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని మాజీ సర్పంచ్ అనంతయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల డాకమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. సీఎం సహాయనిధి కింద రూ.42 వేల చెక్కును మంజూరు చేయించారు. ఈ మేరకు స్థానిక నేతలు బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అనంతయ్య అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిలయ్య, శంకర్, వెంకటయ్య, శ్రీనివాస్, నర్సింహులు, నరేశ్, పవన్, మైపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకుడు

యాలాల: మండల పరిధిలోని అగ్గనూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు శ్రీనివాస్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో యువత పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం ముదిరాజ్ ఉన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించండి


విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్టు కొమ్మలు

దోమ: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని మండల కేంద్రంలో స్థానికులు కోరారు. బ్రాహ్మణవాడ కాలనీలో చింత చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకుతూ ఇబ్బందికరంగా మారింది. దీంతో కోతులు చెట్టుపై చేరి నానా అవాంతరాలు సృష్టిస్తున్నాయి. తరచూ విద్యుత్ సరఫరాకు విఘాతం కలిగిస్తోన్నాయి. ఈ నేపథ్యంలో చెట్ల కొమ్మలను కత్తిరించాలని కాలనీవాసులు విద్యుత్ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్

యాలాల: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీయూటీఎఫ్(తెలంగాణ టీచర్స్ యూనిటైడ్ ఫెడరేషన్) యాలాల మండల అధ్యక్షుడు వెంకటేష్ ప్రసాద్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సరెండర్ లీవులు, జీపీఎఫ్, మెడికల్ బిల్లులతో పాటు పలు రకాల అలవెన్సులు ట్రెజరీ కార్యాలయంలో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని ఆర్థిక సంవత్సరం చివరి నాటికి మంజూరయ్యేలా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి


దౌల్తాబాద్: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కొడంగల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై పోలీసులు హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతూ ప్రజలను చైతన్యం చేశారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోకుండా ఉండాలంటే హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే రోడ్డు నియమాలను తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్ పోలీసులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడింగ్ చేయొద్దు

దౌల్తాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు నియమాలు పాటించాలని ఎస్‌ఐ రవిగౌడ్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ నిఖిల్, ఏఎస్‌ఐ ముత్తురాజు, సిబ్బంది ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్‌లో రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు రవాణా, మౌలిక సదుపాయలు పెంపొందిస్తామన్నారు. పల్లెల్లో రహదారుల ఏర్పాటుతో మండల కేంద్రానికి వెళ్లడానికి అనుకూలమైన వాతావరణం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, పాంబండ ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ మణికుమార్, నాయకులు స్వామి, గోపాల్‌నాయక్, భరత్‌కుమార్‌రెడ్డి, లక్ష్మయ్య, కృష్ణ య్య, వినోద్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

అనంతగిరి: తెలంగాణ పశువైద్యాధికారుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర కాలెండర్, డైరీని సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధన శాఖ అధికారి సదానందం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీజీయూఎస్ ఆధ్వర్యంలో..

దౌల్తాబాద్: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్యానాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై టీయూజీఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌స్వామి, నాయకులు రవినాయక్, రమేష్‌నాయక్, అంబ్ర్యనాయక్, సేవ్యానాయక్, శ్రీహరిరెడ్డి తదితరులున్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం టీజీయూఎస్ జిల్లా శాఖ అధ్యక్షుడు తిమ్యానాయక్, మండల విద్యాధికారి విజయరామారావు మండల విద్యావనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రవినాయక్, నాయకులు రవీందర్ గౌడ్, తిరుపతి, రవీందర్‌నాయక్, రమేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

శ్మశానవాటికలు అభివృద్ధి చేయండి

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్


శ్మశానవాటికను పరిశీలిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: శ్మశానవాటికల అభివృద్ధి కోసం నిధుల మంజూరుపై ప్రభుత్వాన్ని కలిసికట్టుగా నిలదీద్దామని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన సోమవారం పట్టణంలోని బీసీ, ఎస్సీ శ్మశాన వాటికలను నాయకులతో కలిసి పరిశీలించారు. జీవిత చరమాంకంలో సైతం బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రశాంతంగా అంత్యక్రియలు జరిపేందుకు సైతం శ్మశాన వాటికలను అనుకూలంగా లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విన్నవించినా నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బీసీ, ఎస్సీ కుల సంఘాల పెద్దలు, యువత ముందుకు వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు నిధుల మంజూరు కోసం ప్రజాప్రతినిధులు, అధికారులతో తేల్చుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రం శ్రీధర్, జుంటుపల్లి వెంకట్, శివకుమార్, రాము, రమేష్, వెంకట్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కుల్కచర్ల: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కామేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

పది విద్యార్థులకు అల్పాహారం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా గ్రామపెద్దలు, నాయకులు అల్పాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఎంఈఓ హరిలాల్ ప్రారంభించారు. అల్పాహారంతో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అలసట ఉండదని ఎంఈఓ అన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కేశంపేట: నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన అర్హులైన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి తెలిపారు. పాపిరెడ్డిగూడ క్లస్టర్ పరిధిలో 5,600 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని ఆమె తెలిపారు. గతంలో రైతు భరోసా వస్తున్న రైతులు కాకుండా నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పలపల్లి గ్రామంలో ఉన్న రైతు వేదిక వద్ద దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం లేదా భూమి ఆన్‌లైన్‌లో ఉన్న పేపర్, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంక్ డిటెయిల్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నష్ట పరిహారం పెంచండి

హై టెన్షన్ పవర్‌గ్రిడ్ నిర్మాణ బాధితుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నవాబుపేట: హై టెన్షన్ పవర్‌గ్రిడ్ లైన్ నిర్మాణంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని మండలంలోని దాతాపూర్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ జైరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి సమీపంలో పొలాల గుండా హై టెన్షన్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు గుర్తులు వేశారన్నారు. ఒక స్తంభం నిర్మాణానికి నష్ట పరిహారంగా రూ.4 లక్షలు చెల్లిస్తామని ప్రకటించారన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. బహిరంగా మార్కెట్‌లో దాదాపు రూ.4 కోట్లకు పైగా ఎకరం ఉందన్నారు. నిత్యం కూరగాయాలు పండించే తమ భూములను విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఇవ్వడం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ మేరకు నష్ట పరిహారాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బల్వంత్‌రెడ్డి, జంగయ్య, రైతులు గోపాల్‌రెడ్డి, భోజిరెడ్డి, శివారెడ్డి, నరేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, పోలారిస్ ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సదస్సు నిర్వహించి ఉపకార వేతనాలు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యానారాయణరెడ్డి మాట్లాడుతూ.. భావితరాలకు దిశా నిర్దేశం చేసేది పాఠశాల మాత్రమే అన్నారు. తరగతి గది నుంచే విద్యార్థులు తమ లక్ష్యసాధనకు కావాల్సిన మార్గాలను అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో పోలారిస్ ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధులు శ్రీకాంత్, శిరీష, శ్రీను, కళాశాల డీన్ ఉదయశ్రీ, వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఎన్నిక


నియామకపత్రం అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ పట్టణ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు పంది వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అబ్దుల్‌రావుఫ్, మల్లేశ్, ఉమాప్రసాద్, అల్లాడ శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కొమరేశ్, రవికుమార్, రాఘవేందర్, మీడియా కన్వీనర్‌గా ఆదిత్యారెడ్డి, కోశాధికారిగా మేకల వెంకటేశ్, ఉపకోశాధికారిగా నర్సింలు, మల్లేశ్, చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా జాకీరుద్దీన్, సలహాదారులుగా వంశీకృష్ణ, నాగిళ్ల వెంకటేశ్, సభ్యులుగా మిద్దెల వెంకటేశ్, రాఘవేందర్ రెడ్డి, హరికృష్ణను ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులకు డివిజన్ అధ్యక్షుడు నియామకపత్రం అందజేశారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబన్న, అందె మోహన్, వెంకటేశ్, శ్రీధర్‌వర్మ, అశోక్, కొండె యాదయ్య, చెట్ల జంగయ్య, అంజయ్య, గడ్డమీది రమేశ్, నలమోని శ్రీధర్, బాల్‌రాజ్, మల్లేశ్, బుడ్డ నర్సింహ, జంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఏట్లఎర్రవల్లి గ్రామ రైతుల ఖాతాలో జమ చేసినట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామాన్ని ఎంపిక చేసి, గ్రామంలోని 573 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు రూ.64లక్షల 45వేలు వారి ఖాతాలో ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల మంజూరు సైతం త్వరలోనే చేస్తామన్నారు. ఇచ్చిన హామీలను మాట తప్పకుండా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. రైతు భరోసా డబ్బులు జమ చేయడంపై రైతుల తరపున ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించండి


కుల్కచర్ల: తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కుల్కచర్ల: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ కుల్కచర్ల మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ మురళీధర్‌కు పీఆర్టీయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూపీఎస్ విధానం కాకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. పాత పెన్షన్ విధానం అమలయ్యేంతవరకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింలు, పెంటయ్య, జైపాల్ రెడ్డి, సతీష్, తావుర్యనాయక్, వీరేశం, శ్రీశైలం, సుధీర్, అపర్ణ, శేఖర్, తిరుపతిరెడ్డి, కృష్ణయ్య, ప్రకాష్, సంతోష్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

దుద్యాల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ మండల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, వెంకటయ్య, రవినాయక్, వెంకటేశ్, సంపత్‌కుమార్, అంజిలయ్య, మాధవి, పారిజాత, స్వాతి, రామేశ్వరి, రమేశ్, మలికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్‌కు వ్యతిరేకం

యాలాల: ఉద్యోగుల పెన్షన్ విధానంలో యూపీఎస్(యునైటెడ్ పెన్షన్ స్కీం)ను వ్యతిరేకిస్తూ యాలాల మండల పీఆర్టీయూ సంఘ నేతలు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన వారు భోజన విరామ సమయంలో డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నేతలు మొగులయ్య, మహేష్‌కుమార్, ప్రభాకర్‌చారి, షేక్ అహ్మద్, గులాబ్ సింగ్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


దుద్యాల్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

బషీరాబాద్: ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలని బషీరాబాద్ మండల పీఆర్టీయూ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం లంచ్ విరామంలో తహసీల్దార్ వెంకటేశ్‌కు సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూపీఎస్ విధానం కాకుండా ఓపీఎస్ అమలు చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రామ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు.